స్కెచ్ :

# ఆడబడుచులూ-ఆడంబరాలు

"సుజనశ్రీ"

"ఆరేమిటమ్మా! అసలు మన పెద్దాడబడుచుకు మొగుడు పొద్దుపోయి ఇంటికివస్తే సరిగా ప్రక్క వేయటంకూడా తెలీదు!"

"రెండో ఆవిడమాత్రం తీసిపోయిందేమిటి? మొగుడికి సెలవు దొరక్కపోతే తనొక్కతే చక్కా వచ్చేసింది!"

"ఆఁ అసలా ఆడసంతానమంతా అంతే. ఆ మూడో ఆవిడమాత్రం చూడరాదూ! రెండురోజుల ముందరొస్తే పని చెయ్యాల్సి వస్తుందని ఎత్తువేసింది సరిగ్గా గృహప్రవేశం ముహూర్తానిక అరగంట ముందుగా దిగింది"

తోడికోడళ్లిద్దరూ మంచినీళ్ళబావిదగ్గర బిందెలు చంకన పెట్టుకుని గుసగుసలు చెప్పుకుంటూ ఇంటికొస్తున్నారు. దోవలో వంట మనిషి వెంకాయమ్మ ఎదురుపడింది

"ఏం రాజమ్మా! మీఇంట్లో ఇవాళ వంటకి రమ్మంటుందేమో మీ అత్తగార్ని కనుక్కుని చెప్పమ్మా!" అన్నది

"సరేలే!" అని ఆవిడ దాటిపోయిం తర్వాత ఇద్దరూ మాటలు విరుచుకుని పగలబడి నవ్వుకున్నారు

"నలుగురు తోడికోడళ్ళూ, ముగ్గురు కూతుళ్లూ కలిసి అత్తగారిఅలుసు వంచబోతుంటే, నువ్వుకూడా కలయబెట్టాలేం!" అన్నది పెద్దకోడలు కాంతమ్మ.

"బాగా చెప్పావు!" అని వెనక్కుతిరిగి వెంకాయమ్మవేపు చూసి ఒక్క నవ్వు నవ్వింది రాజమ్మ కాంతమ్మకూడ ఆమెతో శ్రుతికలిపింది.

ఇద్దరూ ఇంటిగడపలో అడుగు పెట్టంగానే రెండో ఆడబడుచు స్వాగతం పలికింది. "రండమ్మా రండి! మీ కోసమే చూస్తున్నాను బోలెడన్ని అంట్లుపడి ఉన్నాయి తోమాల్సినవి"

ఇద్దరిముఖాలు నల్లబడినా ఒక్కసారే "మాకోసం కాచుకుని కూర్చోక పోతే తోమటం మొదలెడితే ఈపాటికి సగమై పోయేవిగా!" అన్నది కాంతమ్మ

"ఇంకా ఇద్దరూ ఏంచేస్తున్నట్లు పని అంతా మాకే పెరపెట్టకపోతే!" అన్నది కాంతమ్మ

ఇంట్లో ఒకమూల ఏదోపనిచేస్తున్న మరిద్దరు కోడళ్లుకూడ నోరుచేసుకున్నారు.

"మేమేం ఊరికే కూచోవటం లేదమ్మోయ్ మేమూ మీకంటె ఎక్కువగానే ఒళ్ళువిరుచుకుని పనిచేస్తున్నాం!" అన్నారిద్దరూ పంచపాళీలో కూర్చుని పేపరుచదువుతున్న పరంధామయ్యకూ, ఆయన నలుగురు కొడుకులకూకూడా కష్టమేసింది వీళ్ళసాధింపులు వినేసరికి

"సరేలే! సాయంత్రం తీరిగ్గా తిన్నదరిగే దాకా పోట్లాడుకోవచ్చుగాని పనికానివ్వండి. కాంతమ్మొదినా నువ్వూ రాజమ్మా మా పెద్దచెల్లెలు, మీరు ముగ్గురూ అంట్లపని చూడండి ఇదిగో విజయలక్ష్మి నువ్వు ఇల్లు సర్దేసి ఆపైన బూజు ఊడ్చెయ్యి ఇక సీతమ్మా, నువ్వేమో మడిబట్టలు ఉతికి ఆరెయ్యి నేనూ శకుంతలా వంటపని చూస్తాం!" అని అందరికీ పనులు పురమాయించి తగూతీర్చి అందర్నీ తలో మూలకి పంపింది ఇంటి పెద్దకూతురు శ్యామల. ఆమె తను తమ భార్యలమీద పెత్తనం చేస్తూంటం వింటుంటే నలుగురి కొడుకుల మనస్సులు ఎంత బాధపడ్డయ్యో ఆదేవుడికెరుక. కట్నం డబ్బు పూర్తిగా రాలేదనీ, పండగ మామూలు ముట్టలేదనీ, మామగారు కనీసం తనకు ఫులెన్సూటు కుట్టించలేదనీ, పెళ్ళిలో రేడియో కొనివ్వని కారణంగానూ తమ భార్యల్ని ఒకానొక సమయంలో చావదన్నిన కుమారులకు ఈనాడు తమభార్యలు ఇంట్లో పనిచేసి అరిగిపోతున్నారే అనే బాధ కలిగిందంటే అది ప్రకృతి సహజమే మరి

దొడ్లో అంట్లుతోమే చోట కోడళ్ళిద్దరూ ఒకచోట కూర్చుని ముచ్చటలాడుకుంటూ మెల్లిగా అంట్లు తోముతున్నారు ఇది రెండో కూతురు వరమ్మకు కంటకమయింది. చివరికి ఉండబట్టలేక "కానివ్వండమ్మా! తర్వాత చెప్పుకోవచ్చు ముచ్చట్లు అవతల తొందరగా ఉంది!"

"అబ్బో ఏం దెప్పుతావులే వదినా! నీకు మల్లె మాకు పని చేతగాదుగా మరి!"

"మీకు పని చేతగాదని నే నన్నానా? పని కానివ్వండంటే అంత ఉలుకెందుకు?"

"ఉలుకులేదు ఏంలేదు. అసలు మేమేం చేశామని అంటం! మేం మాత్రం అంట్లు తోమటంలా?"

ఇంతలో ఇంటి యజమానురాలు పరంధామయ్యగారి సతి మంగాయమ్మ అటు వచ్చింది.

"ఇదిగో మీరు పెద్దవాళ్లుగదా, ఇంటికి పెద్ద కోడళ్ళుగదా, ఇల్లు దిద్దాల్సింది పోయి మీరే పోట్లాడితే ఎలా? ఏదో అది చిన్నది అన్నదే అనుకోండి!"

కోడళ్ళిద్దరూ మూతి బిగించుకుని మసి కూడా సరిగా పోకుండా అంట్లు తోమి అవతల పెట్టి, జారుకున్నారు ఇంట్లో ఒక మూలకి

"అది సరేగాని అక్కయ్యా! మరి సత్యనారాయణ వ్రతానికి పీటలమీద ఎవరు కూర్చుంటారు?"

"అదే తెలీకుండా ఉన్నదమ్మా అదిగో పెద్దొదిన ఇటు వస్తున్నది అడుగుదాం ఉండు ఇదిగో వదినా పీటలమీద ఎవరు కూర్చుంటారు?"

"ఎవరేమిటి? ఇంటికి పెద్దలు మా అమ్మా నాన్ననూ!" అని మళ్ళీ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"అయితే వాళ్ళిద్దరే కూర్చుంటారన్న మాట!" అని నోరు నొక్కుకున్నది రాజమ్మ.

'మా వారికి బొత్తిగా ఆలోచనే లేదు. రెండు నెలలక్రితం మొక్కుకున్నాం. మా వారికి ప్రమోషన్‌వస్తే సత్యనారాయణ వ్రతం చేసుకుంటామని ఆ మొక్కుబడి ఇప్పుడే చెల్లించుకుంటే ఖర్చులో ఖర్చు కలిసొస్తుందిగా!" అన్నది పెద్దకోడలు కాంతమ్మ.

"నాకూ మనసుగానే ఉందమ్మా! అసలీ వ్రతం నా పెళ్ళిప్పుడే చేసుకోవాలనుకున్నాం. అడుగుతానుండు మామరదిగార్ని" అని కిటికీదగ్గరకు వెళ్ళింది. బయట మంచం మీద కూర్చున్న రెండోకొడుకు భార్యను చూసి లోపలికి వచ్చాడు దొడ్లోకి వెళ్ళి చిక్కుడు చెట్టు చాటుకి తీసుకెళ్లి తనకోరిక వెలిబుచ్చింది రాజమ్మ.

# ★ ఆడబడుచులూ-ఆడంబరాలు ★

"దానికి నన్నడిగితే ఏంలాభం? మాఅమ్మ నడుగు. నేనుమాత్రం మానాన్నను అడగను" అన్నాడు.

రాజమ్మ ముఖం చిట్లించుకుని లోపలికి వచ్చేసింది. రెండోకొడుకు కాంతారావు వెళ్లి మళ్లీ మంచంమీద కూలబడ్డాడు. ఇంతలో ఇంటి యజమానురాలు మంగాయమ్మ మధ్యహాలులోకి వచ్చింది.

"ఇదుగో అత్తయ్యగారూ! మాఇద్దరికీ గూడ పీటలమీద కూర్చోవాలని ఉంది ఇద్దరికీగూడ మొక్కుబళ్లున్నయ్యండీ!" అన్నది రాజమ్మ

"మరి మీరిద్దరు కూర్చుంటే మిగతాఇద్దరి సంగతేమిటి?"

ఈ సమావేశాన్ని చూసి మిగతా ఇద్దరు కోడళ్లుగూడ వచ్చారు.

"నాకూ మొక్కుబడి ఉన్నదండీ మీ అబ్బాయిగారికి నల్లగొండకు ట్రాన్స్ఫర్ కాకుండాఉంటే వ్రతం చేసుకుంటానని మొక్కుకున్నానండీ!"

"నేనూ మొన్న మీ అబ్బాయిగారికి 104 డిగ్రీల జ్వరం వస్తే ఆభయంలో మొక్కుకున్నానండి వ్రతం చేస్తామని"

ఇద్దరూ తమతమ మొరలు విన్నవించుకునే లోగా పెద్దకూతురు, ఇంటి మేనేజిమెంటు అధికారిఅయిన శ్యామల వచ్చింది "ఏమిటీ సమావేశం అంటూ!"

"ఎట్లా, ఇప్పుడు నలుగురు కోడళ్ళకూ మొక్కుబళ్లున్నయ్యట"

"సరే ఇది మరీబాగుంది. నాకూ, నా చిన్నచెల్లెలు శకుంతలకీ ఇద్దరికీ బయటుండే నెల. మీరంతా పీటలమీదజేరి మేమిద్దరం బయటజేరామంటే ఉంటుంది తమాషా!" సమస్యా పరిష్కారంచేసింది శ్యామల

నలుగురుకోడళ్ళ ముఖాలు వాడిపోయినై. శ్యామల వంటింట్లోకి వెళ్ళిపోయింది. మంగాయమ్మ వ్రతానికి కావాల్సిన సరంజామా సిద్ధంచేయటంలో నిమగ్నురాలైంది. కోడళ్లుమాత్రం ఎట్లాఉన్నవారు అట్లాగే ఉండిపోయారు

"అరేయ్! ఎవరో ఒకరువెళ్ళి పురోహితుణ్ణి కేకేసుకురండిరా!" "పేపర్లో పేజీ తిప్పుతూ అన్నాడు పరంధామయ్య.

"సుబ్బులూ వెళ్లిరారా" పెద్ద కొడుకు! తండ్రి ఆజ్ఞను చిన్న తమ్ముడికి అందించాడు. ఉరుము ఉరిమి మంగలంమీద పడ్డట్టు భార్య అరిగిపోతున్న దేమో-కనీసం ఇప్పటికే సగమై పోయి ఉంటుందేమో - అనే ఆలోచనలో ఉన్న సుబ్రహ్మణ్యం అయిష్టంగానే లేచి బయలుదేరి వెళ్లాడు


ఇంటిముందుగా పోతున్న ఆసామీ ఒకడు నోట్లోనుంచి చుట్టతీసి "గృహప్రవేశమైనా లేమండీ!" అనడిగాడు,

"ఆ. ఆ..తెల్లవారుజామున నాలుగంటలకు కొంచెం సేపైన తర్వాత వచ్చిపో తీరిగ్గా ఉంటే!" అన్నాడు పరంధామయ్య "ఓ! దానికేంలెండి!" అంటూ వెళ్ళిపోయాడతడు

* * *

భోజనాల ముందునుంచి ఆడబడుచులూ, వదినెలూ లేచేసరికి మధ్యాహ్నం రెండయింది. ఎంగిళ్లెత్తేసి తలా ఒక మూల చాప తీసుకుని నడుంవాల్చారు. కూతుళ్ళంతా గురక పెట్టి నిద్రపోతుంటే, మరో మూల కోడళ్లు నలుగురూ ముచ్చట్లు చెప్పుకున్నారు. వాకిట్లో పరంధామయ్య గుర్రుపెట్టి నిద్రపోతుంటే కొడుకులు నలుగురూ సాయంత్రం ప్రోగ్రామేమిటో నిర్ణయించుకుంటూ కూర్చున్నారు. ముగ్గురికి మాత్రం మనసులో సినిమాకు వెళ్ళాలనే ఉంది కాని అది బయటకు వెళ్లగక్కితే మిగతావారి టిక్కెట్ల ఖర్చంతా తాను భరించాల్సి వస్తుందనే భయంతో ఎవరికివారు గప్‌చిప్‌గా ఊరుకున్నారు. ఏదో నెపంతో సతీసమేతంగా ఇంట్లోనుంచి బయటపడితే ఆ పైన సురక్షితంగా హాల్లో కుర్చీల్లో కూలబడొచ్చు అనుకున్నారు ఆ ముగ్గురూ. కాని రెండో కొడుక్కుమాత్రం వీళ్ళంతా ఇంట్లోంచి వెళ్లి పోయి తనూ, తన భార్య మిగిలిపోతే బాగుం

(43 వ పేజీ చూడండి)



## ★ ఆడబడుచులూ-ఆడంబరాలు ★

(26 వ పేజీ తరువాయి)

టుందనే ఆలోచనలో పడి, ఊహించుకో లేక సతమత మవుతున్నాడు.

* * *

సాయంత్రం అయిదయేసరికి నలుగురు కోడళ్లూ ముగ్గురు కూతుళ్లూ, మంగాయమ్మ కొత్త గుడ్డలతో ముస్తాబై కూర్చున్నారు. పెద్ద కొడుకు నాగేశ్వరరావు భార్యను ఇవతలకు పిల్చి ఏవో గుసగుసలు చెప్పాడు. భార్య చింపిరిచేటంత ముఖం చేసుకుని దొడ్డి వాకిలికుండా మళ్లీ హాల్లోకి వచ్చి కూర్చుంది. నాగేశ్వరరావు తల్లి దగ్గరకువచ్చి "అమ్మా! లక్ష్మీపతిగారింటికి వెళ్లొస్తామే! ఆయన్ని చూసి చాలా రోజులయింది" అన్నాడు.

"దానికేం లక్షణంగా వెళ్ళిరండి!" అన్నది తల్లి. మరుక్షణంలో నాగేశ్వరరావూ, కాంతమ్మ ఇద్దరూ ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు.

వాళ్లిద్దరు వెళ్లిపోంగానే మూడో కొడుకు, ఆ తర్వాత నాలుగోవాడు పెద్ద సోదరుని అడుగుజాడల్లో ప్రవర్తించి బయటకు జారుకున్నారు. వీళ్ళంతా పోవటం చూసి రాజమ్మ భర్తను ప్రక్కకు పిలిచి "ఏమండీ! ఏదన్నా సినిమాకు వెళ్దామండీ!" అన్నది భర్త మరేదో చెప్పాడు చిఱునవ్వుతో. "సరేలెండి!" అంటూ సిగ్గుతో తలవంచుకుని లోపలికొచ్చి కూర్చుంది యధాస్థానంలో.

"ఇదిగో! జన్మకో శివరాత్రని అందరం ఇవాళ సినిమాకు వెళ్దాం!" అన్నాడు పరంధామయ్య పరుపుమీదనుండి లేచి ఆవలిస్తూ.

"మరి ఇంట్లో ఎవరుంటారు?" అనడిగింది మంగాయమ్మ. "అయితే ముందు ఎవరెవరు సినిమాకు వస్తారో చెప్పండి?" అనడిగాడు పరంధామయ్య.

"గృహప్రవేశం రోజు గనక ఇల్లు తాళం వేసి పోవటానికి వీల్లేదు ఇంట్లో ఎవరన్నా ఉంటే నేను రెడి!" అన్నది మంగాయమ్మ.

"మేమూ వస్తాం!" అన్నారు కూతుళ్ళు ముగ్గురూ! రెండో కొడుకు కాంతారావు, కోడలు రాజమ్మ ఏం మాట్లాడలేదు.

"ఏరా కాంతం? మీరు ఊకొట్టలేదే?" అన్నాడు పరంధామయ్య.

"నాకు రెండు రాత్రులనుంచి నిదరలేదు నేను రాను! అన్నాడు కాంతారావు. "నాకు తలనొప్పిగా ఉంది నేను రాలేను!" అన్నది రాజమ్మ.

* * *

పర్యవసానంగా జరిగిన గమ్మత్తేమంటే ఒకళ్ళకు తెలియకుండా ఒకళ్ళు పరంధామయ్యగారి కుటుంబం అంతా రెండో కొడుకు, కోడలు తప్ప-ఒకే హాలులో ఒకే కుర్చీ వరుసలో చేరారు. పరంధామయ్య కొడుకులు చేసినపనికి లోలోపల నవ్వుకున్నాడు. ముగ్గురు కూతుళ్ళూ అన్నల్ని దెప్పిపొడిచారు కొడుకులూ, కోడళ్ళ ముఖాల్లో కత్తివాటేసినా నెత్తురు చుక్క లేదు. మంగాయమ్మ ఈవిషయా లన్నింటినీ గమనించికూడ చూడనట్టు ఊరుకుంది

కాంతారావు, రాజమ్మ ఇద్దరూ భోజనం చేసుకుని మనదే రాజ్యం అన్నట్టు ఇల్లంతా ఒకసారి తిరిగి, తలుపులు జాగ్రత్తగా బిడాయించి పడకగది చేరుకున్నారు.

పరుపుమీదకు మేను వాలుస్తూనే ఒక్కసారి గట్టిగా ఆవలించాడు కాంతారావు.

"అప్పుడే నిద్రొస్తున్నదండీ!" అన్నది రాజమ్మ తమలపాకుల చిలకలు నోటి కందిస్తూ.

"నిద్రొస్తే యేం నీ కెందుకు? నీకు తలనొప్పి వచ్చిందన్నావుగా!" అన్నాడు కాంతారావు నవ్వుతూ.

"మామగారు మాత్రం సామాన్యులాయేం? సినిమాకు వెళ్తూ వెళ్తూ తలనొప్పిని వంక నేసుకెళ్ళాగ. కొత్త కూస్త మిగిలి ఉన్న దొంగ తలనొప్పికాస్తా దాని దారిన అది పోయింది." అన్నది రాజమ్మ. ★

## ★ దక్కిందిగొడుగు ★

(34 వ పేజీ తరువాయి)

జేబులు మీద వదలి, అతడి చేతిలో వున్న గొడుగువంక చూస్తూ అడిగాడతను!

"దక్కిందండి కానీ యీ సందర్భంలో మీరు నన్ను క్షమించాలి" వెంకట్రాజు ముందుగానే క్షమాపణాస్త్రాన్ని సీతారామయ్యమీద పడేశాడు!

"దక్కిందిగా... మరిక నేం ..." సీతారామయ్య అదోవిధంగా వెంకట్రాజువైపు చూశాడు!

"నిజంగానే మీరు నన్ను క్షమించాలండి. మీ గొడుగు అందమైన ప్లాస్టిక్ కామతో మొదటిరకం నల్ల సిల్కు గుడ్డతో-కట్టుదిట్టమైన వూచలతో చాలా అందంగా వుండేదండి. కాని నా చేతికి యిది దక్కిందండి" వెంకట్రాజు, కళ్ళనీళ్లు పెట్టుకొని, గొడుగు విప్పి చూపించాడు.

ఆ గొడుగు పాసికుపిడి ఎప్పుడో విరిగిపోయింది! గుడ్డ మొదటిరకందే అయినా అంతా తూట్లుపడిపోయింది; ఊచలు తుప్పుపట్టాయి! "ఇదేమిటి? ఇది నాదికాదు నాకేం అర్థంకావటంలేదు" సీతారామయ్య తెల్లబోతూ అడిగాడు.

"ఏం చెప్పేదండీ?" కళ్ళు తుడుచుకొని, వెంకట్రాజు చెప్పటం సాగించాడు! "మీతో చెప్పినట్లుగా గొడుగు తెద్దామని నిన్న ఏలూరు పనికట్టుకువెళ్లి, వాళ్లింటికి చేరుకొన్నానండి. యోగక్షేమాల తరువాత మా రామారావు ఏమిటేమిటో చెప్పి యీ గొడుగు తెచ్చియిచ్చి: "మరేం అనుకోకు! నాలురోజుల్రకితం-వర్షంలో నీ గొడుగు వేసుకొని కాఫీకి వసంతమహాల్ అనే హోటలుకు వెళ్లాను. గొడుగు – అన్నిటితో పాటూ బయటవుంచి లోపలికెళ్ళాను. కాఫీ త్రాగి, తిరిగి వచ్చిచూస్తే ఆ గొడుగు గల్లంతు! ఏంచేసేది-అక్కడవున్న వాటిల్లోకి బాగున్నదీ, ఆ గొడుగు పోలికలున్నదీ-ఒకటి తీసుకొని మాటాడకుండా బయటకు వచ్చేశాను! మీ గొడుగుకు బదులు యిది నాకు దక్కింది... అనతలాయన ... ఏదో గొడుగు యివ్వమన్నాడని-యింతక్రితం అన్నాడుగా! ఆయన చేతిలో యీ గొడుగు వుంచి జరిగినదంతా చెప్పు" అన్నాడండి. బంగారంవంటి-మీ గొడుగుకి బదులుగా యిది దక్కిందండి..."పది రూపాయల కిమ్మతుచేసే బంగారంవంటి గొడుగును నువ్వు పారవేస్తే, ఆయన్ను నేయేలా సమాధానపరచగలను" అని బాధపడుతూ అంటూంటే చీమయినా కుట్టనటుగా వాడు: "పోనీ... మా యింట్లోఎలుకలు యెక్కువగా వుండటంవల్ల గొడుగు తూట్లుపడిందనీ, ఈ మధ్య వానలు ఎక్కువగా కురుస్తున్నందువల్ల ఊచలు తుప్పుపట్టాయని, పిల్లల మాలకంగా కామ విరిగిపోయిందనీ చెప్పు" మన్నాడండి. "కొత్తప్లాస్టిక్ కామ వేయించుకొని, కొత్త వూచలు పెట్టించి-కొత్త నల్లసిల్కు గుడ్డ వేయిస్తే-అది సరికొత్తగొడుగు అయిపోతుందని, సలహాకూడా యిచ్చాడండీ"...పారవేసినవాడు ఆ విధంగా మర్యాదలేకుండా మాట్లాడితే నేనేం చేసేదండి?..

ఈ మాటలని, వెంకట్రాజు తలదించుకొన్నాడు. సీతారామయ్య, తన్ను తాను ఎలాగో సమాధానపరుచుకొన ప్రయత్నిస్తూ: "పోనీలే...ఏదో గొడుగు దక్కింది! అంతే" అని నోటిచివరనుంచి అన్నాడు!

"బ్రతికించారు" అన్నాడు వెంకట్రాజు పెట్టి ఆనందం పొందుతూ. ★